విద్యార్థులపై పోలీసుల దాడి అమానుషం

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులకు మద్దతుగా ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహిస్తుంటే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జీ చేయించడం అమానుషమని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఖండించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద గొడ్డలి పెట్టులాంటిది, యావత్తు తెలంగాణలో ఉన్న ప్రజా సంఘాలు, విద్యార్థి, మేధావులు ముక్తకంఠంతో ఖండించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

నర్సాపూర్‌లో గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో నిందితుడు

నర్సాపూర్, ఏప్రిల్ 2: నర్సాపూర్‌లోని జగన్నాథరావు కాలనీలో 310 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. డీటీఎఫ్ మెదక్ సీఐ గోపాల్ మాట్లాడుతూ జగన్నాథరావు కాలనీలో నివసిస్తున్న వెంకటేశ్ ఇంట్లో తనిఖీ చేయగా 310 గ్రాముల గంజాయి లభించిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌హెచ్‌వో నర్సాపూర్‌కు అప్పగించామన్నారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి డీపీఈవో శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం నర్సాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు చంద్రయ్య, ఎల్లయ్య, రాజు,రవి, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

పాపన్నపేట ఠాణాలో 228 ఫోన్లు రికవరీ

ఫిర్యాదుదారులకు ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

పాపన్నపేట, ఏప్రిల్ 2: సెల్‌ఫోన్లు రికవరీ చేయడంలో పాపన్నపేట ఠాణా మొదటి స్థానంలో నిలిచింది. మెదక్ జిల్లాలో 3404 మొబైల్ ఫోన్లు చో రీ లేదా పోయినట్లు ఫిర్యాదులు అందాయి. అందు లో 1846 ఫోన్లను రికవరీ చేశారు. పాపన్నపేట పోలీస్టేషన్ పరిధిలో 304 ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు అందగా వీటిలో 228 రికవరీ చేసినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం పాపన్నపేట పోలీస్టేషన్‌లో రికవరీ అయిన మొబైళ్లు ఫిర్యాదుదారులకు 22 సెల్ ఫోన్లను డీఎస్పీ, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. రికవరీ కోసం అసాధారణ కృషి చేసి పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ దుర్గాప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

చెరువులో పడి బీటెక్ విద్యార్థి మృతి

బెల్లం మనీశ్ మృతదేహం

నర్సాపూర్, ఏప్రిల్ 2: చెరువులో జారి పడి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన నర్సాపూర్‌లోని రాయారావు చెరువులో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లోని బాచుపల్లి ప్రాంతానికి చెందిన బెల్లం మనీశ్(20) ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తన ఆరుగురి స్నేహితులతో సరదాగా నర్సాపూర్ సమీపంలోని రాయారావు చెరువుకు వచ్చారు. చెరువు తూముపై మనీశ్‌తో పాటు ముగ్గురు మిత్రులు కూర్చొని ఉన్నారు. మిగతా మిత్రులు బిర్యాని తీసుకొచ్చేందుకు పట్టణానికి వెళ్లారు. తూము మీద కూర్చున్న మనీశ్ జారి చెరువులో పడిపోయాడు. ఇది గమనించిన ఇద్దరు మిత్రులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో వెతకగా మనీశ్ మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

భాషా(ఫైల్)

చిలిపిచెడ్, ఏప్రిల్ 2: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన ఘటన చిలిపిచెడ్ పోలీస్టేషన్ పరిధిలోని జగ్గంపేట వైన్స్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన గంగిఎద్దుల భాషా(45) చిలిపిచెడ్ మండలం జగ్గంపేట వైన్స్ వద్ద పర్మింట్ రూంలో బాగా మద్యం సేవించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అంబదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

నిజాంపేట, ఏప్రిల్ 2: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ కొన్న ఘటన క ల్వకుంట శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక మం డలం, పోతారెడ్డిపేట గ్రా మానికి చెందిన చింతకింది భాను పులి మామిడికి వెళ్తున్న క్రమంలో కల్వకుంట గ్రామ శివారులోకి రాగానే నార్లపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్ బైక్‌ను అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వచ్చిన బైక్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భాను తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం దవఖానకు తరలించారు. భాను చిన్న నాన్న రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు బహూకరణ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 2: కుర్మపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి చిన్నశంకరంపేట నివాసి, ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ బుధవారం కుర్చీలు బహూకరించారు. తాను సంపాదించిన దానిలో కొంత పేదలకు అందించాలనే సంకల్పంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ రేణుక, స్వామి, బుర్రప్ప రాజు ఉన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: పట్టణంలో నిర్మిస్తున్న సీతారాముల స్వామి పునఃప్రతిష్టాపన మహోత్సవం కోసం ఆలయ కమిటీ అధ్వర్యంలో బుధవారం విరాళాలు సేకరించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రిక జెండాను అందజేశారు. రామాలయం కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, గ్రామపెద్దలు జంగం శ్రీనివాస్, అలుగుల సత్యనారాయణ, మురళీపంతులు, సుభాశ్‌గౌడ్, ఆర్ఎన్ సంతోష్ కుమార్, గంగారెడ్డి, సీతారామరావు తదితరులున్నారు.

సన్న బియ్యం లేవని ఫిర్యాదు రాకూడదు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- హవేళీఘనపూర్ రేషన్ షాపుల్లో తనిఖీ, నర్సాపూర్,రామాయంపేటలో బియ్యం పంపిణీ చేసిన కలెక్టర్

హవేళీఘనపూర్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్‌లోని 15వ వార్డులో సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్

మెదక్, (నమస్తే తెలంగాణ)/మున్సిపాలిటీ/నర్సాపూర్, ఏప్రిల్ 2: ఏ ఒక్క రేషన్ దుకాణంలో సన్నబియ్యం నిల్వ లేదని ఫిర్యాదు రాకూడదని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ 15 వార్డులో, హవేళీఘనపూర్‌లోని రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రేషన్ దుకాణానికి కేటాయించిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించి, కోటాకు అనుగుణంగా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. దానికి అనుగుణంగా బియ్యం స్టాక్ ఉందా అని తెలుసుకున్నారు. బియ్యం పంపిణీలో లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రేషన్ కార్డులు కలిగిన 2,13,820 మందికి ప్రతి నెల 4430.496 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా అందిస్తారన్నారు. లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణంలో, రామాయంపేటలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబులతో కలిసి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నగేశ్

నిజాంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ గౌడ సంఘం సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ: సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

నిజాంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ గౌడ సంఘం సభ్యులు

నిజాంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ గౌడ సంఘం సభ్యులు

- సమసమాజ నిర్మాణ స్థాపన కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు
- అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా అదనపు కలెక్టర్, బీసీ సంఘం నాయకులతో కలిసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, అతని సేవలను కొనియాడారు. కుల, మత, జాతి విభేదాలు లేకుండా సమసమాజ నిర్మాణ స్థాపన కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

నిజాంపేట, ఏప్రిల్ 2: నిజాంపేటలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గౌడ సంఘం సభ్యులు సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయాన్ని ప్రపంచానికి అందించారన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నర్సాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో

నర్సాపూర్, ఏప్రిల్ 2: నర్సాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అశోక్‌గౌడ్, గౌడ సంఘ సభ్యులు పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు.

మెదక్ పట్టణ సంఘం ఆధ్వర్యంలో

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పసుపులేరు వద్ద గల పాపన్న విగ్రహానికి మెదక్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు మంగ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 2: రామాయంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహం వద్ద మండల గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్‌గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు చేగుంటకు ఎమ్మెల్యే రాక

చేగుంట, ఏప్రిల్ 2: నేడు చేగుంట, నార్సింగి మండలాల్లోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రానున్నట్లు తహసీల్దార్లు శ్రీకాంత్, కరీంలు బుధవారం తెలిపారు.

ముగిసిన పది పరీక్షలు

చిన్నశంకరంపేటలో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2: మార్చి 21న ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పుస్తకాలతో కుస్తీ పడుతూ పరీక్షలు రాసిన విద్యార్థులు.. పరీక్షలు ముగియడంతో తోటివారితో సంతోషాన్ని పంచుకున్నారు. చివరిరోజు సాంఘికశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాల్లో 10,408 మందికి 10,382 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని డీఈవో రాధాకిషన్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

రామాయంపేట, ఏప్రిల్ 2: మండల, పట్టణంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ రజనీకుమారి బుధవారం అందజేశారు. మండలంలోని అక్కన్నపేట 1, దంతెపల్లి 1, డి.ధర్మారం 3, కోమటిపల్లి 1, కోనాపూర్ 1, లక్ష్మాపూర్ 1, రాయిలాపూర్ 4, రామాయంపేట 5, సుతారిపల్లి ఒకరికి మొత్తం 18 మందికి పంపిణీ చేశారు.

మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 2: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే కొత్త సమస్యను కొనితెచ్చుకున్నట్లే అని ఎస్సీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని, మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని, వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలు, బెట్టింగ్ యాప్స్‌తో ప్రజలు ఎలా మోసపోతున్నారో ఎస్ఐ శంకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం బస్టాండ్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

హెచ్‌సీయూ భూముల వేలం వెంటనే ఆపాలి

ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారినాగరాజు, నాయకులు

చిలిపిచెడ్, ఏప్రిల్ 2: హెచ్‌సీయూ 400 ఎకరాల భూములను వేలం పాట వేసి, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని ఖండిస్తున్నట్లు సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చిలిపిచెడ్‌లో జోగిపేట, నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం, సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి: సీపీఎం

చండూర్‌లో పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు డిమాండ్ వ్యక్తం చేశారు. బుధవారం చండూర్‌లో ఎస్సీ, వడ్డెర కులాలకు చెందిన ఇల్లు, రేకుల షెడ్లను కూల్చివేసిన వాటిని ఆయన పరిశీలించారు. ఏన్నో ఏండ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారికి తెలియకుండా కూల్చేయడం సరికాదన్నారు. ఆయనతో మల్లేశం, శేఖర్, వెంకటేశ్, దుర్గాదాస్, లక్ష్మణ్, దాసు తదితరులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల చలివేంద్రాలు ప్రారంభం

రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో చలివేంద్రం

చిన్నశంకరంపేటలో..

రామాయంపేట, ఏప్రిల్ 2: రామాయంపేట లయన్స్ క్లబ్ స్నేహబంధు వారి సౌజన్యంతో సీహెచ్‌సీలో బుధవారం చలివేంద్రం ప్రారంభిచారు. స్నేహబంధు లయన్స సభ్యులు శ్రీనివాస్, డాక్టర్ లింబాద్రి ఉన్నారు.

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 2: మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు బుధవారం చలివేంద్రం ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి కంఠారెడ్డి ఆర్థిక సాయం

నిజాంపేట, ఏప్రిల్ 2: జడ్చెరువు తండాకు చెందిన మాలవత్ తుకారం (41) మంగళవారం రాత్రి నిజాంపేట నుంచి తండాకు వెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: శ్రీరామనవమి సందర్భంగా స్థానిక రామాలయంలో బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణలతో హోమం నిర్వహించారు.

సీతారామ కాలనీకి టైల్స్ అందజేత

చేగుంట, ఏప్రిల్ 2: చేగుంటలోని సీతారాముల కాలనీలో శ్రీరామనవమి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసే మండపానికి జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి రూ.50 వేల విలువ గల టైల్స్‌ను బుధవారం అందజేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

వెల్దుర్తి, ఏప్రిల్ 2: వెల్దుర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం 40వ వార్షికోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, అఖండదీపారాధన, స్వస్తిహవచనం, దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేశారు. శివపార్వతులు, శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణాన్ని నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈపాస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలి

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ విజయనిర్మల

మెదక్‌రూరల్, ఏప్రిల్ 2: ఈపాస్ మిషన్ ద్వారా ఎరువులు విక్రయించాలని ఏడీ విజయనిర్మల అన్నారు. బుధవారం మెదక్‌లోని ఎరువుల దుకాణాలు, సొసైటీల్లో ఎరువులను మెదక్ వ్యవసాయ స హాయ సంచాలకురాలు తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల కు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరల కు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఏవో శ్రీనివాస్, ఏఈవో రాజశేఖర్, సీఈవో సాయికుమార్ ఉన్నారు.

రేపు మెదక్‌లో విద్యుత్ గ్రీవెన్స్ డే

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై మెదక్‌లోని జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 4న సీజీఆర్ఎఫ్ (కస్ట్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ శంకర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, కరెంటు బిల్లు, రసీదు తీసుకురావాలని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు చెప్పారు. మెదక్ డివిజన్, తూప్రాన్ డివిజన్‌లోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు బట్టి ఉదయ్‌పటేల్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 2: ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మెదక్ జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బట్టి ఉదయ్‌పటేల్ అన్నారు. బుధవారం స్థానిక మున్నూరు కాపు కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులవ్వాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు సాయిలు పటేల్, ఉపాధ్యక్షుడు సుభాశ్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఎల్లయ్య పటేల్, రాములు, మోహన్ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

చేగుంట, ఏప్రిల్ 2: నార్సింగిలోని రైతు వేదికలో జెప్తిశివునూర్, సంకాపూర్, శేరిపల్లి తదితర గ్రామాలకు చెందిన ఏడుగురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం అందజేశారు. తహసీల్దార్ కరీం, ఆర్ఐ శ్రీధర్, సర్వేయర్ శ్రీకాంత్ పలువురున్నారు.

ఆర్టీసీ డిపోలో అభినందన సభ

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను అభినందిస్తున్న డీఎం సురేఖ

నర్సాపూర్, మార్చి 2: నర్సాపూర్‌లోని ఆర్టీసీ డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభను బుధవారం నిర్వహించారు. డిపో మేనేజన్ సురేఖ ఉత్తమ ఉద్యోగులుగా అవార్డునందుకున్న వారిని అభినందించారు. డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్, డ్రైవర్, కండక్టర్లు నాగమణి, రాజేశ్వరి, యాదగిరి, ముర్షద్, మురళి, జమీల్‌మియా, శంకరయ్య, చంద్రయ్య, మధుసూదన్, కృష్ణస్వామిని సన్మానించారు.

ఎస్సెస్సీ స్పాట్‌ను బహిష్కరిస్తాం: తపస్

మాట్లాడుతున్న తపస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2: పదో తరగతి మూల్యంకణంలో గతేడాది పాల్గొన్న ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యూనరేషన్ ఇవ్వక పోవడం సిగ్గుచేటని తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం అన్నా రు. బుధవారం తపస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే ఎస్సెస్సీ మూల్యంకణాన్ని తాము బహిష్కరిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు వెంకటస్వామి, మల్లారెడ్డి, గోపాల్, ప్రవీణ్, సంతోష్ ఉన్నారు.

ఆపదలో అండగా స్నేహితులు

నిజాంపేట, ఏప్రిల్ 2: నందిగామకు చెందిన ప్రదీప్‌కుమార్ కొన్ని రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి స్నేహితులు, గ్రామస్తులు సేకరించిన రూ.28 వేలను నిజాంపేటలోని పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన పథకంలో జమచేసి, పాసుబుక్‌ను బాధిత కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. స్నేహితులు దయాకర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.